# చెలిమి

మూలం: ఏండర్సన్
అనువాదం: ఎమ్.వి.దాస్



**నే**ను అతడిని మొట్టమొదటిసారి కలిశాను. శరీరంపై యెలాంటి ఆచ్ఛాదన లేదు. గోచీ మాత్రమే వుంది. యిప్పటికి ముప్పది సంవత్సరాల నుండి అతనితో నాకు విడదీయరాని స్నేహం.

అతని పేరు బైరా. పూజారి కులస్థుడు. అడవుల్లో నివసించే అనాగరిక జాతీయుడు. స్నేహం విలువ యేమిటో అతని వల్లనే నాకు తెలిసింది.

నేను భారతదేశంలోనే జన్మించి, యిక్కడనే స్థిరపడిన విదేశీయుడిని.

పట్టణంలో నివసిస్తున్న ప్రభుత్వోద్యోగిని. ధనవంతుడిని. బైరా జన్మించింది, నివసిస్తున్నది అడవిలోనే. నిరుపేదవాడు. కేవలం వేటయే ఆధారంగా వున్న నిషాదుడు. మా యిద్దరి స్నేహం యాదృచ్ఛికంగా జరిగింది. ఆ స్నేహమే యీనాటికి విడదీయరాని జీవితబంధంగా పరిణమించింది. మేమిద్దరం ఒకే తల్లి బిడ్డలమేమోననే విధంగా బలపడింది.

తెలతెలవారుతూ వుంది. ఉషోదయం- లేత సూర్య కిరణాలు ప్రసరిస్తున్న సమయం. ముత్తూరులో వున్న అటవీ శాఖాధికారుల బంగళా కొద్ది దూరంలో నున్న సెలయేటి సమీపంలో చీనార్ నది నుండి పారేవాగు కలుస్తున్న ప్రదేశం. అది వేసవి కాలం. వాగు యెండిపోయివుంది. నేను రైఫిల్ తీసుకొని కాళ్ళకు చెప్పులు లేకుండా వాగులో యిసుక మీద నెమ్మదిగా అడుగులేస్తూ పులి తాలూకూ పాద ముద్రలు వున్నాయోమేనని వెదుకుతూ పోతున్నాను. ఫారెస్టు బంగళా నుండి రెండు మైళ్లదూరం అడవిలోనికి వచ్చి వుంటాను. అడవిలో నెమళ్లు, కోళ్లు అరుస్తున్నాయి. పూర్తిగా తెల్లవారింది.

నేను వాగు వెంబడి యిసుకలో నడుస్తున్నాను. ఎడమవైపున వున్న పొదల్లో నుంచి యేదో కదిలిన శబ్దం వినబడింది. అడుగుల సవ్వడి లేకుండా దగ్గరికి వెళ్లాను. ఆ పొదలో చిన్న గొయ్యి కనబడింది. అందులో కొద్దిగా నీరుంది. అడవి జంతువులను దొంతగనంగా వేటాడే వ్యక్తులు ఆ గోతికి దగ్గరగానే మాటు యేర్పాటు చేసుకొని, అందులో కూర్చొని నీరు త్రాగడానికి వచ్చే జంతువులను వేటాడి చంపడానికి తయారుచేసుకున్న ప్రదేశమన్నమాట. ఆ రోజుల్లో అడవి జంతువులు విపరీతంగా వుండేవి. అయినా సరే, ఏ వ్యక్తి అయినా ప్రభుత్వంనుండి అనుమతిలేకుండాగాని, తుపాకి లైసెన్సులేకుండా గాని అడవి జంతువులను వేటాడి చంపడం చట్టరీత్యానేరం. అప్పటికీ, యిప్పటికీ, యెప్పటికీ కూడా నేరమే.

మాటు అంటే- జంతువులు సంచరించే ప్రదేశంలో మనం జంతువులకు కనబడకుండా వుండటానికి అనువుగా తయారుచేసుకున్న ప్రదేశం. ఆ మాటు అనేదాన్ని నేలమీద గాని, చెట్టుమీదగాని, గోతిలోగాని, మన వునికిని జంతువులు గమనించకుండా వుండేలా తయారుచేయడం మాటు. చుట్టూ కొమ్మలు, ఆకులు పేర్చి, జాగ్రత్తగా కట్టాలి. గాలి వాటం కూడా చాలా ముఖ్యం. మన గాలి జంతువులకు సోకగూడదు. మనిషికన్నా, అడవి జంతువులకు, చూపు, వాసన పసికట్టే శక్తి చాలా యెక్కువ. ఈ మూడు శక్తులు కూడ జంతువులకు తమ రక్షణకై భగవంతుడిచ్చిన వరాలు. మనిషి తెలివితేటలు వాటిముందు యెందుకూ పనికిరావు. ఈ మూడింటి వల్ల, మనిషినుండి తమను తాము రక్షించుకోగలుగుతున్నవి. అయినా నిత్యం వాటికి ప్రాణ భయం వెంటాడుతూనే వుంటుంది.

మాటువున్న ప్రదేశంలో ఎవడో వేటగాడు వుండి తీరాలి. నాకు చిన్న శబ్దం వినవచ్చిన దగ్గరకు వెళ్లి- తమిళంలో-''ఎవడురాలోపల? బయటికి రారా'' అన్నాను. జవాబులేదు. యింకా కొంచెం ముందుకు వెళ్లి, మళ్లీ పిలిచి- ''ఒరే బయటికి రారా- లేకపోతే రైఫిల్ పేలుస్తా'' అని అన్నాను.

వాడు నా అరుపుకి భయపడ్డాడు. నా ముందుకు వచ్చి నిలబడ్డాడు. సన్నగా, నల్లగా వున్నాడు. గోచీ మాత్రం పెట్టుకుని వున్నాడు. సాష్టాంగ నమస్కారం చేసినట్లు నాపాదాలపై బడి, మూడుసార్లు వాడి తలను నా కాళ్లపై ఆనించాడు. ఈ మూడుసార్లకు నాకు తెలిసిన అర్థ- మనసా-వాచా- కర్మణా- త్రికరణశుద్ధిగానన్నమాట.

''పైకి లేవరా!'' అన్నాను.

లేచినిలబడ్డాడు.

''ఎవడవురా నువ్వు?''

''దొరా! నేను అడవుల్లో నివసిస్తున్న పూజారి కులస్థుడిని. బైరాని.''

''నీ తుపాకి యెక్కడ?''

''ఏం తుపాకి దొరా? నాలాటి పేదవానికి తుపాకి యెలా వుంటుంది దొరా? నాకు తుపాకి పట్టుకోవడమే చేతగాదు. దారి తప్పి, రాత్రంతా యిక్కడేవున్నాను. ఈ పొదలోనే నిద్రపోయాను. మీ మాట విని యిలా బయటికొచ్చాను. మీరేమో, నీ తుపాకి యెక్కడంటున్నారు.

''ఒరే. వెదవ్వేషాలెయ్యకు. నీ తుపాకి యెక్కడ పెట్టావో తీసుకు రారా. వాడు భయపడ్డాడు. పొదల్లో దాచి వుంచిన నాటు తుపాకి. చాలా పాతది. దట్టింపు తుపాకి. నా ముందుంచాడు.

ఆ విధంగా నేను బైరా ను కలుసుకోవడం జరిగింది.

అడవిలో పరిచయమయిన బైరాతో నాకు విడదీయరాని స్నేహమేర్పడి ముప్పది సంవత్సరాలయింది.

అడవి అంటే ఏమిటి? వేట అంటే యెలా వుండాలి? అడవి జంతువుల లక్షణాలు, ప్రవర్తన పద్ధతులు వాటి పరిస్థితులు, మనుగడ, ఏ జంతువునెలా వేటాడాలి? యివన్నీ నాకు నేర్పాడు బైరా.

''నీవు ఏ జంతువును చంపావు?'' అన్నాను.

''రాత్రంతా కాపుగాశాను. ఏ జంతువూ నీటికి రాలేదు దొరా.''

''నీ వేషాలన్నీ నీకు తెలుసుగాని, దేన్ని చంపావో చెప్పు'' అని గద్దించాను.

నన్ను తనతో కొంచెం ముందుకు తీసుకొని వెళ్లి చూపించాడు.

ఒక ఆడ కణుజు (సాంబరంటారు) తుపాకి వేటుకు గాయమైన స్థలం నుండి రక్తం కారుతూనే వుంది.

నాకు కోపం వచ్చింది. కళ్లెర్రజేసి చూస్తూ ''ఏం పనిరా యిది?'' అని అడిగా.

''దొరా మేము చాలా పేదవాళ్లం. వేటాడి యేదో ఒక జంతువును చంపకపోతే మాకు తిండేలేదు. చావే శరణ్యం దొరా.''

బైరాను నా దగ్గరకు వచ్చి కూర్చోమన్నాను. కూర్చున్నాడు.

నా జేబులోంచి కొంచెం పొగాకు తీసి యిచ్చాను. తీసుకున్నాడు. అనుమానించి, వాసన చూశాడు. సంతోషంగా నవ్వాడు. ముక్కలుగా తుంచి నోటిలో వేసుకున్నాడు. నమిలాడు.

''దొరా మేము చాలా పేద వాళ్లం. వేటాడి యేదో ఒక జంతువును చంపకపోతే మాకు తిండే లేదు. చావే శరణ్యం దొరా.''

''దొరా! మీరు నా విషయం ఫారెస్టు దొరలకు చెప్పకండి. నేను, నా కుటుంబీకులు బ్రతకడానికి యీ తుపాకి వేట మాత్రమే ఆధారం. వారికి తెలిస్తే నా తుపాకి తీసుకుంటారు. నన్ను జైల్లో పెట్టిస్తారు. నా భార్యా బిడ్డలు దిక్కులేని వారైపోతారు దొరా.'' అన్నాడు దీనంగా.

అడవిలో జంతువులు అంటే పెద్దపులిగాని, చిరుతపులిగాని, మరేదయినా క్రూరమృగంగాని మనుష్యులకుగాని, పశువులకుగాని హానీ కలిగిస్తుంటే వాటిని వేటాడి చంపడానికి ప్రభుత్వం నుండి లైసెన్సు పొందిన వాణ్ణి నేను. మనుష్యుల్ని, పశువుల్ని చంపి తింటున్న పులుల్ని వేటాడటానికి ప్రభుత్వమే- నాలాంటి వేటగాళ్లకు అనుమతి, బహుమతులుకూడా యిస్తుంది. ప్రభుత్వం నుండి అనుమతి లేకుండా అడవి జంతువులను వేటాడి చంపడం నేరం. అలాంటి వారిని పట్టి ప్రభుత్వానికి అప్పగించడం నాలాంటి అనుమతిదారులు చేయాలి. వేటాడటంలో కూడా కొన్ని నియమాలు, కట్టుబాట్లు పాటించాలి.

కేవలం అడవి జంతువులను వేటాడి జీవించే అనాగరిక, ఆటవిక జాతుల్లో కూడా ఈ విషయంలో కొన్ని నియమాలున్నాయ్. అవి- పరవ నోపకయున్న, మైమరచి పెంటి చెనగియున్న, తెవులుకొని యున్న, చూలితోయున్న...అలాంటి సందర్భాలలో జంతువులను చంపరాదని నియమాన్ని పాటించేవాళ్లు. వేటాడిన మాంసాహారమే భుక్తిగా వున్న ఆటవిక జాతివాళ్లు.

పరుగెత్తలేక యున్నను, నిద్రపోతూ వున్నను, జతకట్టే సమయం లోను, రోగగ్రస్థమైయున్నపుడును, ఆడజంతువులను, బాల్యావస్థలో యున్న జంతువులను, వధించరాదనే నియమాలకు కట్టుబడివుండే వారు అడవిజాతివారు కూడా. ఆడ జంతువులను వేటాడటంవల్ల జంతు సంపద తరిగిపోతుంది.

బైరాను చూస్తుంటే నాకు జాలికలిగింది.

''నీవు వుండేదెక్కడరా?''

''మాకు వుండటానికి యిల్లు లేదు దొరా. పగలంతా అడవుల్లో తిరిగి తేనె సేకరించి, పట్టణాలకు పోయి, తేనె అమ్ముకొని, తిండి గింజలు కొనితెచ్చుకొని బ్రతుకుతాం దొరా. ఏదయినా అడవి జంతువు దొరికితే దాని మాంసం యెండబెట్టుకొని తింటూ కొన్నాళ్లు కాలం గడుపుతాము. అడవిలో దొరికే ఉడుముల్ని చంపి తింటాము. ఉడుం మాంసం తింటే నడుమునొప్పులు పోతాయి. ఉడుం తోకల్ని ఎండించి పొడిచేసి, ఆ చూర్ణం పట్టణాల్లో డాక్టర్లకు అమ్ముకుంటుంటాము. నాటు వైద్యులు యీ మందు యెక్కువగా కొంటారు. ఈ చూర్ణం తింటే ఆడ, మగ వాళ్లలో ఒకరిపై ఒకరికి ప్రేమ యెక్కువగుతుంది దొరా. మీరెవరయినా అమ్మాయిని ప్రేమించి వుంటే ఆయమ్మాయి మీ కులం గాకపోతే, నేనిచ్చే యీ పొడిని ఆయమ్మాయి యెడమ భుజానికి పులిమితే యిక మిమ్మల్ని వదలదు.'' వాడు ఉత్సాహంగా